రైల్వేకోడూరు ఆసుపత్రికి మహర్దశ

- అన్ని వసతులతో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కొత్తగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం

రైల్వేకోడూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో రైల్వేకోడూరు నియోజకవర్గంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అయితే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రత్యేక కృషితో పట్టణంలోని పాత సామాజిక ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలో నూతనంగా అన్ని హంగులతో ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసుకుంది. 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం రైల్వేకోడూరుకే తలమానికంగా నిలిచింది. గతంలో సామాజిక కేంద్రాన్ని పట్టించుకున్న ప్రభుత్వాలే లేవు. ముఖ్యంగా గత టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి చేయనప్పటికీ పాడుబడిన భవనంలోనే ఆసుపత్రిని నిర్వహించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు.ఈ దశలో రైల్వేకోడూరు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ విప్ కొరముట్ల ఆసుపత్రి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నూతన సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని ఉత్తమ నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం పూర్తి చేయించారు.

కార్పొరేట్‌కు దీటుగా సామాజిక ఆరోగ్య కేంద్రం

నూతన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రూ.6 కోట్ల నిధులతో కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా నిర్మించి ప్రారంభానికి ముస్తాబు చేశారు. ఇక్కడి ప్రజలకు ఆపరేషన్ థియేటర్, 4 వార్డులు, లేబొరేటరీ, ఎక్స్‌రే గది, స్కానింగ్ రూములు అధునాతన వసతులతో నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. అలాగే ప్రజలకు అన్ని రకాల వ్యాధులకు వైద్యసేవలు సేవలు అందించనున్నారు.

అందుబాటులో అన్ని రకాల వైద్యసేవలు



కోడూరులో నిర్మించిన 30 పడకల ఆస్పత్రిలో ప్రజలకు కావాల్సిన అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. గతంలో లాగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఆపరేషన్ థియేటర్, వార్డు రూములు, స్కానింగ్‌లు మొదలైనవి ఏర్పాటు చేశారు.
– డాక్టర్ చైతన్య, వైద్యాధికారి, రైల్వేకోడూరు

ఇంత అభివృద్ధి ఎప్పుడూ చూడలేదు



కోడూరులో ఎన్నడూ చూడని విధంగా అభివృద్ధి జరుగుతోంది. గతంలో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలంటే భయపడేవారు. నూతన ఆస్పత్రి భవనం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. – కాకర్ల చంద్రశేఖర్‌రెడ్డి, రైల్వేకోడూరు

మండెం లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న లక్ష్మీనరసింహస్వామి


ప్రత్యేక అలంకారంలో వెంకటేశ్వర స్వామి


భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారి మూలవిరాట్‌లు

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె పంచాయతీ జల్లావాండ్లపల్లె గ్రామంలో వెలిసిన మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌మూర్తిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వెంకయ్య స్వామి ఆలయంలో..

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో వెలసి ఉన్న వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే వెంకటేశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకారం చేశారు.

వెంకన్న ఆలయంలో..

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ అడవికమ్మపల్లెలో కొలువైన శ్రీనివాసుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు.

ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలి


తల్లెంవారిపల్లె జెడ్పీ హైస్కూలు పోస్టర్‌లు విడుదల చేస్తున్న సీఎం సలహాదారు

ఓబులవారిపల్లె : మండలంలోని అటవీ శివారు గ్రామాలైన గాదెల, తల్లెంవారిపల్లె, కొత్తపల్లె, నూకనపల్లె, జీవీ పురం, దళితవాడల విద్యార్థులు తల్లెంవారిపల్లెలో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం సలహాదారు ఆర్.ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. శనివారం గాదెల పంచాయతీ తల్లెంవారిపల్లె నూతన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎంఈఓ పద్మజ, స్థానిక ఉపాధ్యాయులతో పాఠశాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. 2023–24 విద్యా సంవత్సరానికి విద్యార్థుల శాతం ఎక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు కార్పొరేట్ తరహా విద్య అందించేందుకు చర్యలు చేపట్టారన్నారు. అనంతరం నూతన తల్లెంవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించిన పోస్టర్‌లు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీర్‌మున్ని, ఎంఈఓ పద్మజ, ఆర్ఐ రామ్మోహన్, ఉపాధ్యాయులు ఆదినారాయణరెడ్డి, రవికుమార్, నరసింహారెడ్డి, అశోక్, సుదీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితుల వివరాలు తెలపండి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

చిట్వేలి : ఒడిశా రైలు ప్రమాదంలో ఈ ప్రాంతానికి చెందిన వారు ఉంటే బాధితుల వివరాలను తక్షణం తెలియజేయాలని తహసీల్దార్ మురళీకృష్ణ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైలు ప్రమాద బాధితుల వివరాలు తెలుసుకునేందుకు రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రామసుబ్బారెడ్డి 9440880280, ఏఎస్ఓ దామోదర్ 9848845078 నంబర్లతో రెండు కంట్రోల్‌రూములను ఏర్పాటు చేశామన్నారు.

సబ్‌కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

రాజంపేట : ఒడిస్సా రైలు ప్రమాదం దుర్ఘటన చోటుచేసుకున్న నేపథ్యంలో సబ్‌కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఆర్డీఓ భాస్కర్ తెలిపారు. డివిజన్‌లో తొమ్మిది మండలాలకు సంబంధించి ఎవరైనా ఉంటే వారి వివరాలను కంట్రోల్ రూంకు తెలియజేయాలన్నారు. బంధువులు, స్నేహితులు ఎవరైనా రైలులో ప్రయాణిస్తున్నట్లు తెలిసినా సమాచారం ఇవ్వాలన్నారు. వివరాలకు 7093167956, 7660849959 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వేరుశనగ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలి


వేరుశనగ విత్తనకాయలను అందిస్తున్న ఎంపీపీల సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, తదితరులు

లక్కిరెడ్డిపల్లి : ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేసుకునే రైతులకు ఆయా గ్రామాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తున్నట్లు అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక వెలుగు సభా భవనంలో వ్యవసాయ అధికారి కిషోర్ నాయక్‌తో కలిసి రైతులకు విత్తన కాయలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి సహకారంతో మండలానికి ఇప్పటికే రెండువేల క్వింటాళ్లు వేరుశనగ విత్తన కాయలు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, విత్తనకాయలు అందిస్తుండటం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, సర్పంచ్ వెంకట నారాయణ రెడ్డి, సిద్ధక నాగిరెడ్డి, కాలాడి జనార్దన్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్‌లు రాజారెడ్డి, రాజబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, చెన్నకేశవరెడ్డి, నారద, ఏఈఓలు కేరోలిన్, సాయి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికార సభను విజయవంతం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న బీఎస్పీ నేతలు

రాయచోటి అర్బన్ : ఈనెల 19న నిర్వహించనున్న రాయలసీమ బహుజన రాజ్యాధికార సభను విజయవంతం చేయాలని బీఎస్పీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు యుగంధర్ కోరారు. శనివారం స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో ఆయన జిల్లాస్థాయి బీఎస్పీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాయలసీమ బహుజన రాజ్యాధికారసభ కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో న్యాయవాది నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణ అందరి బాధ్యత


ఆర్టీసీ బస్టాండులో ప్రజలను జాగృత పరుస్తున్న కళాజాత బృందసభ్యులు

రాయచోటి అర్బన్ : వాతావరణ కాలుష్య నివారణ అందరి బాధ్యత అని కళాజాత కళాకారులు తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. వీధినాటికలు, మేజిక్, హాస్య సన్నివేశాలు, ఆట పాటలతో ప్రజలను ఆకట్టుకున్నారు. ప్లాస్టిక్ వినియోగం వలన ప్రజలు తమకు తెలియ కుండానే కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నారని వివరించారు. ప్లాస్టిక్‌ను కాల్చితే వెలువడే డయాక్సిన్, ఫ్యూరాన్ విషవాయువుల ద్వారా ప్రజలు ఊపిరి తిత్తులు, శ్వాసకోస వ్యాధులతో పాటు క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపివేసి జూట్, గుడ్డ, నార, కాగితపు సంచులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో కళాకారులు ఉమాశంకర్, పవన్‌కుమార్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైకిల్ దినోత్సవం



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తం

రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం సైకిల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు డాక్టర్ ఎల్.రాజమోహన్‌రెడ్డి, వెంకటనరసయ్యల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీని ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తం ప్రారంభించి మాట్లాడారు. సైకిల్‌ను తొక్కడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు తక్కువ దూరం ఉంటే సైకిల్‌పైనే వెళ్లడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఐఎల్ఎన్ చంద్రశేఖర్‌రావు, ఎన్‌సీసీ అధికారి మేజర్ విజయభాస్కర్, అధ్యాపకులు మహబూబ్‌బాషా, రామకృష్ణ, శివరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట


ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న వడ్డిపల్లి గ్రామస్తులు


వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పుల్లంపేట : మండల పరిధిలోని వత్తలూరు పంచాయతీ, వడ్డిపల్లి గ్రామంలో రేణుకా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. రైల్వేకోడూరు నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొల్లం గంగిరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీను, మల్లి, వెంకటయ్య, పెంచల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ట

ఓబులవారిపల్లె : కటికంవారిపల్లె గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆశ్రమంలో శనివారం శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు లీలావతమ్మ, రైల్వేబోర్డు సభ్యుడు తల్లెం భరత్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు కొమ్మూరు మల్లేశ్వరి, బీఆర్ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.


యల్లమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట

వీరబల్లి (రాయచోటిటౌన్) : వీరబల్లె మండలం వంగిమళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన యల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.

రామనోళ్లపల్లె తాగునీటి సమస్య పరిష్కరిస్తా


రామనోళ్లపల్లెలో నెలకొన్న తాగునీటి సమస్యను త్వరగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. మంచి నీటి సమస్యను పరిష్కరించడమే కాకుండా త్వరలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేస్తానని చెప్పారు.

నూతన పాఠ్య పుస్తకాలు అందజేత


పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నూతన పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓ శంకరయ్య

సిద్దవటం : మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయులకు శనివారం నూతన పాఠ్య పుస్తకాలను అందజేసినట్లు ఎంఈఓ శంకరయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న విద్యా కానుకలో భాగంగా సిద్దవటం మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు, ప్రాథమికోన్నత పాఠశాలలకు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, బెల్టు, బ్యాగులు మంజూరు చేయడంతో వాటిని మండల విద్యా వనరులకేంద్రం నుంచి సంబంధిత ప్రధానోపాధ్యాయులకు అందజేశామన్నారు. అలాగే సిద్దవటంలోని భవిత కేంద్రం పాఠశాలలో బుద్ధిమాంద్యం గల పిల్లలకు కిట్లను పంపిణీ చేశామని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు, ప్రధానోపాధ్యాయులు, ఐఈడీ ఉపాధ్యాయులు విజయలక్ష్మి, పద్మావతి, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు వారధులు వలంటీర్లు


వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి

వీరబల్లె (రాయచోటిటౌన్) : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధిగా నిలుస్తున్నారని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం వీరబల్లె మండల పరిషత్తు కార్యాలయంలో వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వలంటీర్లపై ఎంతో నమ్మకం పెట్టుకున్నారని చెప్పారు. ఆయన నమ్మకాన్ని వమ్ము కానీయకుండా వలంటీర్లు సేవలందిస్తున్నారని తెలిపారు. వైఎస్ జగన్ తిరిగి ముఖ్యమంత్రి అయితే సచివాలయ వ్యవస్థను మరింత పటిష్టపరుస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్ర నాథరెడ్డి, జెడ్పీటీసీ శివరాం, సర్పంచ్‌లు నేతి ఆంజనేయులు, సోమారపు నాగార్జునాచారి, స్థానిక నాయకులు వీరనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం అందిస్తున్న విత్తన వేరుశనగ కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం వీరబల్లె మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు.

ప్రభుత్వ పథకాల అమలులో వలంటీర్లే కీలకం

రైల్వేకోడూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో చేరవేయడంలో వలంటీర్లది కీలక పాత్ర అని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల కార్యాలయంలో ఓబనపల్లి, శెట్టిగుంట పంచాయితీల వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవినీతికి, అలసత్వానికి తావులేకుండా ప్రతిగ ఢుకు పింఛన్, పథకాలు అందిస్తున్న వలంటీర్ల సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగార్జున, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రిప్‌పై అవగాహన సదస్సు

పెనగలూరు : మండలంలోని ముద్రపల్లి రైతు భరోసా కేంద్రంలో రాజంపేట హార్టికల్చర్ అధికారి సురేష్ ఆధ్వర్యంలో బిందుసేద్యం పరికరాల అమరికపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో రైతు పొలంలో ఉద్యాన పంటలకు తుంపర సేద్యం పరికరాలు ఏ విధంగా అమర్చాలి అనే విషయంపై ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. బిందు సేద్యం కావాలన్న రైతులు ఆర్‌బీకేలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కాలుష్య గ్రామాల తరలింపునకు నోటీసులు

ఓబులవారిపల్లె : మంగంపేట కాలుష్య గ్రామాలైన కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాల తరలింపునకు సంబంధించి సంబంధిత వ్యక్తులకు శనివారం రెవెన్యూ, ఏపీఎండీసీ అధికారులు నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మినుకు సుధాకర్, మేనేజర్ బేనర్జీ, ప్రమీల, వైఎస్సార్‌సీపీ నాయకులు గజ్జల శ్రీనివాసులు, తల్లెం భరత్‌కుమార్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

గాలివీడు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులు పూర్తి చేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు బదిలీ అయిన స్థానానికి వెళ్లాలని ఎంపీడీఓ శేఖర్ నాయక్, ఎంఈఓ చక్రినాయక్‌లు తెలిపారు. శనివారం ఎంపీడీఓ సభా భవనంలో బదిలీ అయిన ఉపాధ్యాయులతో సమావేశమై పనుల పురోగతిపై చర్చించారు.

రైలు ప్రమాదంలో స్థానికులు ఉంటే తెలియజేయాలి

ఒడిస్సా రైలు ప్రమాదంలో గాలివీడు మండలం నుంచి ఎవరైనా స్థానికులు ఉంటే గ్రామ సచివాలయంలోగానీ, తహసీల్దార్ కార్యాలయంలోగానీ పూర్తి వివరాలు తెలియజేయాలని తహసీల్దార్ దైవాదీనం తెలిపారు.

సిద్దవటం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రాజేష్‌కృష్ణ

సిద్దవటం : సిద్దవటం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ రాజేష్‌కృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శంకర్‌రావు బదిలీపై వల్లూరు మండలానికి వెళ్లారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు.

నేడు పౌర్ణమి ధ్యానం

రాయచోటిటౌన్ : రాయచోటిలోని షిరిడీ సాయి బాబా మందిరంలో ఆదివారం సీనియర్ పిరమిడ్ మాస్టర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో పౌర్ణమి ధ్యానం నిర్వహించనున్నట్లు రాచవీడు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 5-30 గంటల నుంచి రాత్రి 8-30 గంటల వరకు తిరిగి రాత్రి 9 గంటల నుంచి 12-30 గంటల వరకు ధ్యానం ఉంటుందన్నారు.

నక్షత్ర తాబేలు డీఎఫ్‌ఓకు అప్పగింత

రాజంపేట : రోడ్డు మీద దొరికిన నక్షత్ర తాబేలును రాజంపేటకు చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి జిల్లా అటవీశాఖాధికారి వివేక్‌కు శనివారం అప్పగించారు. రైల్వేకోడూరు నుంచి పుల్లంపేటకు వస్తున్న సమయంలో రోడ్డుమీద నక్షత్ర తాబేలు ఉండటాన్ని గమనించారు. దాన్ని తీసుకొచ్చి డీఎఫ్‌ఓ కార్యాలయంలో అప్పగించగా, దానిని అటవీ ప్రాంతంలో వదిలారు.

ఆకట్టుకున్న హరికథ

పెనగలూరు : వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన హరికథ ఆకట్టుకుంది. అంతకుముందు గ్రామస్తులచే కోలాటం వేయించారు. రెడ్డిసంఘం వారు రాత్రి ఉభయదాతలుగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి ముదిరాజ్ సంఘం వారు గరుడసేవ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం వేణుగోపాల స్వామి కల్యాణం గొనేనివారు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సుబ్బారెడ్డి, పురోహితుడు సుబ్బనరసయ్య తెలిపారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

రాజంపేట రూరల్ : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వై.శ్రీనివాసులరెడ్డి కోరారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన జీత భత్యాలు చెల్లించేలా చట్టం తీసుకురావాలని కోరారు. సంఘం కార్యదర్శి గురుప్రసాద్ మాట్లాడారు.

టపాసుల గోడౌన్‌ను పరిశీలించిన డీఎస్పీ

చిట్వేలి : చిట్వేలిలోని టపాసుల గోడౌన్‌లను శనివారం డీఎస్పీ పరిశీలించారు. చిట్వేలి గరుగుపల్లి సమీపంలోని పొలాలలో ఉన్న కామిశెట్టి ప్రతాప్‌కు చెందిన గోడౌన్‌ను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఐ విశ్వనాథరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోగుల పట్ల అశ్రద్ధ తగదు

రాజంపేట రూరల్ : వైద్యం కోసం వచ్చే రోగుల పట్ల అశ్రద్ధ వహించడం తగదని అడిషనల్ డీఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ శైలజ పేర్కొన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలోని లెప్రసీ, ఐసీటీసీ సెంటర్‌లను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. లెప్రసీ వార్డులో నెలకు ఎంత మంది పరీక్షలు చేయించుకుంటున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐసీటీసీ సెంటర్‌లో రోగుల మందుల వాడకంపై ఆరా తీశారు. టీబీ సూపర్‌వైజర్ పిల్లి జయప్రకాష్ పాల్గొన్నారు.

కేంద్ర రైల్వేశాఖ మంత్రి రాజీనామా చేయాలి


మాట్లాడుతున్న భాస్కర్

రాజంపేట రూరల్ : ఒరిస్సా రాష్ట్రంలో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూల భాస్కర్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మానవ తప్పిదాలతో జరిగిన ఈ ప్రమాదంలో వందలాది మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. మృతుల కుటుంబాలకు రూ.20లక్షలు, క్షతగాత్రులకు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న వైస్ ప్రెసిడెంట్ విజయ్ రెడ్డి

పెనగలూరు : రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలలో రెవెన్యూ సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేలా రెవెన్యూ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చంద్ర మోహన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అవధూత నారాయణ స్వామి ఆరాధనోత్సవాలు

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల గ్రామం ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో వెలసిన అవధూత నారాయణ స్వామి 74వ ఆరాధనోత్సవాలను ఆదివారం ఉదయం 6.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సీతారాంరెడ్డి శనివారం తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, 12.40 నిమిషాలకు అభిషేకం, 1.20 నిమిషాలకు మహా మంగళ హారతి, తీర్థప్రసాదం అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. రాత్రి 9గంటలకు సత్య సాయి జిల్లా కదిరికి చెందిన శ్రీ లక్ష్మీవెంకటేశ్వర కళాబృందంచే సాసవుల చిన్నమ్మ కథను నాట్య రూపంలో ప్రదర్శిస్తారన్నారు. అలాగే బండలాగుడు పోటీలు కూడా నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయం


పెద్దజంగంపల్లెలో సిమెంట్ రోడ్డును పరిశీలిస్తున్న దృశ్యం

సంబేపల్లె : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ అభివృద్ధే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందని మండల జేసీఎస్ కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం దుద్యాల పంచాయతీ పెద్దజంగంపల్లెలో సిమెంట్‌రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి తరతమ భేదాలు చూపకుండా అభివృద్ధి ఫలాలు అందరికి అందేలా సమన్యాయం పాటిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని కొనియాడారు.

పోటాపోటీగా టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏపీ టిడ్కో రిటైర్డ్ సీపీఓ యల్లటూరు శ్రీనివాసరాజు

నందలూరు(రాజంపేట) : నందలూరు క్రీడామైదానంలో శనివారం పోటాపోటీగా మండలస్థాయి హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ కొనసాగింది. కుమ్మరపల్లె యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలను ఏపీ టిడ్కో రిటైర్డ్ సీపీఓ యల్లటూరు శ్రీనివాసరాజు ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ యల్లంటూరు శివరామరాజు, నాగిరెడ్డిపల్లె అర్బన్ మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మాజీ ఎంపీటీసీ మాడపూరి శ్రీరాములు, తోటశివశంకర్, నిర్వాహకులు రంజిత్, దీపు, గ్రీష్మంత్‌రెడ్డి , క్రీడాకారులు పాల్గొన్నారు.